

# ఇంకో జన్మలో

శ్రీ నేమాన బాషారావు.

సీతకి పన్నెండేళ్లుంటాయి. అంత అందంగా లేక పోయినా- చురుకైనపిల్ల. నలుపూ తెలుపూ—కలిసిన శరీరచ్ఛాయ—గుండ్రని మొహం- పెద్ద కళ్ళూ—ఎత్తైన బుగ్గలూ—అవీ- మొత్తంమీద సంసార పక్షంగా వుంటుంది. సీత అంటే ఆమె తల్లికీ- తండ్రికీ- అమితమైన ప్రేమా అభిమానమూను. మాధవరావు స్కూళ్ల డిప్యూటీ ఇనస్పెక్టరు పనిచేస్తూ పది సంవత్సరా లవుతుంది. ఈ పదేళ్ళ లోనూ మంచి ఆస్తీ- అదీ సంపాదించాడు. తనకు కొడుకైనా- కూతురైనా వొక్క- సీతే. అందువల్ల మోహనరావుని తనదగ్గిరే వుంచుకున్నాడు. చిన్నప్పణ్ణించీ సీతా, లలితా, కలిసి మెలసి వుండేవాళ్లు- ఒక్క- స్కూల్లోనే చదివారు కూడ. లలిత వాళ్ళింటికి ఎదురుగావున్న యింట్లో వుండేది. భోగాలైనప్పటికీ చాలా కాలం నుంచీ వృత్తిమానేసి నలుగురులోనూ మంచి అనిపించుకునేవాళ్లు- లలితా ఆమె తల్లీని. లలిత చిన్నప్పుడే వాళ్ళ తండ్రి చనిపోయాడు. అప్పణ్ణుంచీ ఆమె తల్లి తన్ని కడుపులో పెట్టుకుని పెంచింది. ఇంట్లో మొగ దక్షత లేకపోయినా కులాసాగా కాలక్షేపం చేస్తూ వుండేవాళ్లు. లలితకి పదమూడేళ్లుంటాయి. కొంచెం సన్నగా పొడుగ్గా వుంటుంది—తెల్లని దేహచ్ఛాయ—కొంచెం కోలమొగం—సోగ కన్నులూ—నవ్వినప్పుడల్లా గుంటలు పడే లేత నునుబుగ్గలూ—రింగు రింగులుగా పొడుగాటి నల్లని జుట్టూ—మెత్తగా తామర తూళ్లలాంటి కాళ్ళూ- చేతులూ- సౌందర్యం అంతా వొంపులుతిరిగిన ఆమె దేహంనుంచి వులికి పడుతూంది.

మేడమీద గదిలోంచి వీధిలోకి కిటికీ. రోజూ సాయంకాలం కాలేజీ నుంచి వొస్తూనే పుస్తకాలు టేబిలు మీద పారేసి, అక్కడ నిలబడుతూ వుండేవాడు మోహనరావు. ఎదురుగా వున్న కిటికీలోంచి జిగజిగ మెఱిసిపోయే రెండు కన్నులు అతన్ని నిత్యం ఆహ్వానిస్తూండేవి. ఆ కిటికీవంక తదేక ధ్యానంతో చూస్తూ తన్ని తానే మరచిపోయేవాడు. అవాళ మామూలుగా కాలేజీనుండి వస్తూనే కిటికీ దగ్గరకు వెళ్ళి నిలబడ్డాడు. ఎదురుగా వున్న కిటికీలోంచి లలిత అవుపించింది. అతన్ని చూసి వొక్క- నవ్వునవ్వి చటుక్కున మాయమై పోయింది లలిత. అప్పుడే వొచ్చి సీత టేబిలుమీద కాఫీవుంచి వెళ్ళి

ప్రేమకు స్వరూపమే ప్రధానమని కొందరూ—
కాదు, హృదయమే ముఖ్యమని కొందరూ,—
ఇవి రెండూ కావు,—ధనమే మూలమని కొందరూ
—అన్నారు.

ఈ కథ పై మూడు కారణములలో ఒకటి ప్రేమకు కారణమని నిర్ణయిస్తుంది.



పోయింది. కాఫీ త్రాగడం అయ్యాక మళ్ళీ కిటికీలోంచి చూశాడు తన్నిచూస్తూ లలిత మొహం వాల్చింది.

మధ్యాహ్నం మూడుగంట లవుతుంది. కింద వరండాలో సీత కూర్చుని హార్మోనియంమీద ఏదో పాడుతూంది. లలిత మెల్లగా వొచ్చి ప్రక్కనే కూర్చుంది. సీతపాట ఆపేసింది.

"నువ్వొక్క పాట పాడవూ?"

"… … … … …"

"ఏం- పాడవూ?"

"మీ నాన్నగారింట్లో లేరూ?"

"ఊఁఊఁ: రాజమండ్రీ వెళ్లారు"

"ఎప్పు డొస్తారు?"

"ఏమో!"

"… … … … …"

"పాడవూ-"

"మీబావ యింట్లో వున్నారా?"

"లేడు." అంది మెల్లగా లలిత దగ్గిరకి హార్మోనియం నెట్టుతూ.

"ఏం పాటపాడేది."

"నీయిష్టం."

మెల్లగా హార్మోనియం వాయిస్తూ కంఠం దాన్తో కలిపింది. అంతవరకూ మేడమీద కూర్చుని ఏదో రాసుకుంటూన్న మోహనరావు ఆమెపాట వినబడేసరికి లేచినిలబడ్డాడు. ఆమెది కోకిలస్వరం. పాడుతూన్నంతసేపూ ఆమె కంఠంలోంచి అమృతం వులికి పడుతూంది. వినిపిస్తూ ఉన్న పాటలో ఆమె రూపూ- లావణ్యమూ స్ఫురించాయి అతనికి. అకస్మాత్తుగా పాట ఆగిపోయింది. గబగబా క్రిందికి దిగాడు. వెళ్లిపోతూ లలిత అతన్ని చూసి నవ్వింది.

౨

అవాళ సాయంకాలం మోహనరావు కాలేజీ నుండి యింటికివొచ్చి- మెట్లెక్కి తన గదిలోకి వెళ్తూంటే- సీతా లలితా తన గదిలోంచి పైకినచ్చి గబగబా మెట్లు దిగి వెళ్ళిపోయారు. గదిలో ప్రవేశించే సరికి యిదివరకు టేబిలుమీద చిందరగా పడున్న పుస్తకాలన్నీ సర్ది వున్నాయి. గదంతా నీటుగావుంది. ఆల్మైరాలో కొన్ని పూలదండలూ విడిగా కొన్ని గులాబీపువ్వులు వున్నాయి.

కిటికీదగ్గర కెళ్ళి తొంగిచూశాడు. తన్ని చూసి లలిత నవ్వింది. తనూ నవ్వాడు. లలిత గిరునతిరిగి మాయమైంది. అప్పుడే సీతవొచ్చి కాఫీ టేబిలుమీద వుంచింది.

"పువ్వు లెవరిచ్చారూ?"

"...............”

"నువ్వు తీసుకో."

"నాకక్ఖర్లేదు."

"ఏం?"

"...............”

"ఎవరిచ్చారూ?"

"నాకు తెలీదు."

"అవుతే నాకొద్దు."

"ఏమో."

తరువాత వొకటి- రెండుసార్లు మాత్రం లలిత వాళ్ళింటికి వొచ్చింది. అప్పణ్ణుంచీ రావడం మానేసింది. ఎందుకురావడం మానేసిందో మోహనరావుకి బోధపడడంలేదు. కాని రోజూ సీతా మాత్రం పువ్వులు తీసుకొచ్చి తనకిస్తూ వుండేది.

సాయంకాలం సీత వొచ్చింది.

"ఏం సీతా- లలిత రావడం లేదేం?"

"ఏమో నాకు తెలీదు" అంది.

కిటికీదగ్గరకు వెళ్ళి కిందికి చూశాడు. ఎవ్వరూ కనబడలేదు. గదిలో అటూ- యిటూ- చాలాసేపు తిరిగాడు. అప్పుడే కొంచెం చీకటి పడుతూంది. కిటికీదగ్గర కుర్చీలో కూలబడ్డాడు. నీలిఆకాశంలో వేలాడే కొత్తకొత్త నక్షత్రాలు కిటికీలోంచి తొంగి చూస్తున్నాయి అతని వేపు. టేబిలుమీద టిక్ టిక్ మని కొడుతూంది గడియారం. అతని మనస్సులో అదో మోస్తరుగావుంది- ఆమె రూపూ- లావణ్యమూ తన హృదయంలో ప్రతిఫలించాయి. జిగజిగ మెఱసిపోయే కన్నులూ - రింగురింగులుగా పొడుగాటి జుట్టూ ఆ కోలమొహం......

భోజనానికి కబురొచ్చింది.

కిందికి దిగి వెళ్ళిపోయాడు.

భోజనం పూర్తి అయ్యాక మేడమీదికివొచ్చి లైటు హెచ్చించి పక్కనున్న పుస్తకం తెరిచాడు. దాల్లో వున్న అక్షరాలన్నీ తన కన్నులముందర కదులుతున్నాయి. ప్రతీ అక్షరంలోంచీ కదుల్తూన్న ఆమెకన్నులు ఆహ్వానించాయి అతన్ని. పుస్తకం మూసి లైటు తగ్గించి గదిలో అటూ- యిటూ- పచారు చేస్తూన్నాడు. కొంతసేపటికి ఆగి వాచీ చూశేడు. రాత్రి 9 గంటలు అయింది. మొహం కడుక్కుని బట్టలు వేసుకుని బయల్దేరాడు సినీమాకి.

సినీమాదగ్గర అవుపించారు లలితా ఆమె తల్లీని. మోహనరావుని చూడగానే లలిత అటు మొహం తిప్పింది. ఆ ముఖంలో యిదివరకు వుండేకళా- వుత్సాహమూ నశించిపోయాయి. మెల్లగా దగ్గిరికి వెళ్ళి "మా యింటికిరావడం మానిశావేం?" అని అడిగాడు.

"పంతులుగారు వొద్దన్నా"రండి.

ఇప్పుడు బోధపడింది అతనికి లలిత ఎందుకు రావడం మానేసిందో. సినీమా చూడకుండా తిన్నగా యింటికి వొచ్చాడు. ఆరిపోతూన్న దీపం హెచ్చించి కుర్చీలో కూలబడ్డాడు. అతనికిప్పుడు అన్ని సంగతులూ బోధపడ్డాయి. తన్ను తానే నిందించుకున్నాడు. చాలాసేపు అలాగే కూర్చున్నాడు ఏదో ఆలోచిస్తూ. రాత్రి అప్పుడే పదకొండుగంట లవుతుంది. దిగ్గునలేచి కొన్ని పుస్తకాలూ—బట్టలూ—పెట్టెనిండా సర్దేడు. మర్నాడు వుదయమే ప్రయాణ మయ్యాడు వాళ్ళ వూరికి.

3

వాళ్ళవూరినుంచి తిరిగివచ్చాడు. వస్తూనే కనిపించింది లలిత. మునుపటికన్నా కొంచెం చిక్కింది. ఇదివరకు ఆమెలో వుండే వుత్సాహమూ—చురుకుదనమూ కనిపించలేదు. తిన్నగా యింట్లోకివెళ్ళి తన గదిలో ప్రవేశించాడు. అక్కడున్న ప్రతీది మునపట్లాగే వున్నాయి—తనలో మాత్రం కొంచెం-మార్పూ. కిందికిదిగి స్నానం చేసి భోజనంకి తయారయ్యాడు. భోంచేస్తూవుంటే తెలిసింది—తన మామగారికి రాజమండ్రీ బదిలీ చేశారనీ

వొకటి రెండు రోజుల్లో అందరూ ప్రయాణ మవుతున్నారనీ. తనకింకా పరీక్షలు నెల్లాళ్లున్నాయి. అంతవరకు తాను ఇక్కడే వుండాలి.

మోహనరావు తప్ప అంతమందీ రాజమండ్రీ వెళ్లిపోయారు. అప్పట్నుంచీ తానొక్కడూ వుంటూ హోటల్లో భోజనం చేస్తున్నాడు. రోజూ అవుపిస్తూండేది లలిత. యిదివరకు తనలో వుండే విచారమూ — ఆందోళనా అంతా నశించింది. పరీక్షలు దగ్గిరపడుతున్నాయి. అందువల్ల రాత్రనక-పగలనక తీవ్రంగా చదువుతూన్నాడు పాతపాతాలన్నీ పట్టుతో.

పరీక్షలన్నీ అయిపోయాయి. పేపర్లన్నీ బాగా రాశాడు మోహనరావు. ఇంకా రెండు మూడు రోజుల్లో యింటికి వెడదామనుకుంటున్నాడు. మామూలుగా అవాళరాత్రి హోటల్నుండి యింటికి వొచ్చాడు. కొంచెంగా జ్వరం తగిలినట్లయింది. కష్టంమీద ఆరాత్రి నిద్రపట్టింది. తెల్లవారేసరికి మొహంమీదా-వొంటినిండా స్ఫోటకం వేసింది. సాయంకాలానికి యెక్కువైంది. పనిమనిషి చేత కబురంపాడు డాక్టరుకి. డాక్టరువొచ్చి మరేమీ తొందర్లేదనీ-జాగ్రత్తగా మాత్రం వుండమనీ-చెప్పి వెళ్లిపోయాడు. అప్పట్నుండీ పనిమనిషి రావడం మానేశాడు. హోటల్నుండి ప్రతిపూట కారియరు మాత్రం వస్తూండేది.

సాయంకాలం ఆరున్నర అవుతుంది. గదిలో కను చీకటి. అప్పుడే హోటల్నుండి టిఫిన్ కారియరు వొచ్చింది. గదిలో వో మూల్ని మంచంమీద పడుక్కున్నాడు. మోహనరావు మూలుగుతూ. మంచం కింద కొన్ని వేపరెమ్మలు-అవీ వున్నాయి. తలుపు కొంచెం వారేసుంది. కిటికీలోంచి కొంచెంగా గాలి కొడుతూంది. మంచంమీద పడుక్కుని గోడవక్క శూన్యంగా చూస్తూ ఏదో ఆలోచిస్తున్నాడు. అప్పుడే తలుపు కొంచెం తోసుకుని లలిత వొచ్చి అతని మంచం పక్క నిలబడింది. కొంతసేపు నిశ్శబ్దం. ఆమెవక్క చూస్తూ జలజలమని నీళ్లు కార్చాడు మోహనరావు అతికష్టంతో :

"లలితా ఎందుకొచ్చావు. యిక్కడికి?" అన్నాడు.

"………………"

"ఊఁ…ఊఁ…ఎందుకూ?"

అతనిపక్కను కూర్చుంది లలిత. అతని కన్నుల్లోకి చూస్తూ మోహనరావు ఆమెపక్క చూడలేక పోయాడు. లలిత తదేకధ్యానంతో అతనిపక్క చూస్తూంటే ఆమె కన్నుల్లో నీళ్లు కమ్మింది. రెండు చేతుల్తోనూ అతని తలెత్తి తన తొడమీద పెట్టుకుని, అతని మొహంకేసి చూస్తూంటే ఆమె కన్నుల్నుండి రెండు వేడి కన్నీటి బిందువులు అతని కళ్లల్లో రాలేయి.

౪

రోజులు గడచినకొద్దీ మోహన్‌రావుకి వొంటినిండా సూది మోపడానికేనా వీల్లేకుండా స్ఫోటకం వేసింది. రాను రాను స్ఫోటకం హెచ్చవుతూండడంవల్ల అతను కదల్లేని స్థితిలో వున్నాడిప్పుడు. కళ్లువిప్పడానికేనా అవకాశం లేకుండా రెండు కళ్లల్లోనూ స్ఫోటకం వేసింది. తానెంత వొద్దంటూన్నా లలిత మాత్రం అక్కడేవుండేది. రాత్రనక పగలనక అతన్ని కనిపెట్టుకుని చిక్కి శల్యావశిష్ఠ అయిపోయింది. రోజూ అతనికి ఏమికావలసినా తానే చూస్తూండేది. అతను స్ఫోటకంనుంచి తేరి జీవించాలన్న ఆశ తప్ప ఆమె కిప్పుడు మరేమీ అక్ఖర్లేదు. మోహనరావు ఎంత వొద్దంటూన్నా తను మాత్రం తన శక్తి వంచన లేకుండా సంరంక్షణ చేస్తూనేవుంది.

పదిహేను రోజులు గడిచాయి. మోహనరావు కొంచెం తేరుకున్నాడు. మరోవారం నాటికి స్ఫోటకం అంతా దిగజారింది. గదిలో కొంచెం తిరుగుతూన్నాడు. అప్పట్నుంచీ లలిత రావడం మానేసింది. మునుపటికీ-యిప్పటికీ తనలో బ్రహ్మాండమైన మార్పు కలిగింది. మునుపు తాను ఎంత అందంగా వుండేవాడో-మోహనరావు యిప్పుడు అంత కురూపిగా మారేడు. నిగనిగలాడే అతని మొహంనిండా-దేహంమీదా మచ్చలు తేరాయి. జబ్బులో వొక కన్ను కూడా గుడ్డిదయింది. అద్దంలో

తన్ను తాను చూసుకొని సిగ్గుపడ్డాడు. హాలోమని యేడ్చాడు. లలిత తనకు చేసిన సంరక్షణకి ఆమె ఋణం తాను తీర్చలేననుకున్నాడు. ఇదివరకు ఆమె తన్ని ప్రేమించింది కాని యిప్పుడో......?

రాత్రి ఎనిమిది అవుతుంది. నిండు వెన్నెల. అప్పుడే హోటల్నుండి వొచ్చి డాబామీద కుర్చీ వేసుకుని కూర్చున్నాడు మోహనరావు. దూరాన్నున్న నీలి మేఘాలసందుల్లోంచి తొంగితొంగి చూస్తూందో తార. గాలి రివ్వున వీస్తూంది. చంద్రునివంక తదేకధ్యానంతో చూస్తూ వో వేడి నిట్టూర్పు విడిచాడు. మునుపటి దినాలన్నీ జ్ఞప్తి తెచ్చుకున్నాడు. లలితయొక్క ప్రేమా-రూపూ అతనిలో యిమిడి పోయింది. ఆమె విశాల హృదయంలో తన కిప్పుడు స్థానం లేదని తలచుకున్నప్పుడు తన హృదయం కరిగిపోయింది. మునుపు తన జబ్బులో నిరంతరమూ తన్ని కనిపెట్టుకుని వున్న ఆమె యిప్పుడు కనిపించడమే లేదు. ఆమె లేని జీవితం అంతా కిటికిచీకటిమయం అనుకున్నాడు. అతని హృదయంలో వున్న ఆవేదన అంతా పొంగి పొరలుతూంది.

మెల్లిక్కీ అతనికి తెలియకుండా మెల్లిగా వొచ్చి అతని వెనక నిలబడింది లలిత. అతని కళ్ల వెంట జలజల మని నీరు ప్రవహిస్తూంది. లలిత తన రెండు చేతుల్తోనూ అతని తల నివురుతూ "ఏం?" అంది. వులికిపడి వెనక్కి తిరిగి తన రెండు చేతుల్తోనూ ఆమె చేతుల్ని పట్టుకుని అదో మోస్తరు గొంతుతో :

"లలితా! క్షమించు. నీ ఋణం యీ జన్మలో తీర్చుకోలేను. దానికి కారణం నువ్వూ కావు-నేనూ కాను. యింకో జన్మలో......" యింక మాట్లాడలేక పోయాడు. లలిత తన రెండు చేతుల్తోనూ అతని కంఠాన్ని పెనవేసి "ఇంకో జన్మలోనా?" అంటూ నవ్వింది.


## జగదేకరంభ

జగదేకరంభయన నీమెయే జగదేకరంభ. రంభ అంటే దేహ సౌందర్యముచేతనేగాక శీలసౌందర్యముచే ప్రపంచాన్ని మెప్పించిన నారీరత్నము. చమత్కారమైన కథ.

గ్లేజు ప్రతి 1-కి 0-10-0 తపాలఖర్చులు వేరు:

## మిత్రద్రోహము

తిన్నయింటికి వాసాలెంచు పామెతనుబట్టి యల్లబడిన రసవంతమగు నవల. ఇదివర కిట్టినవల వెలువడలేదు అపరాధాన్వేషకము అత్యద్భుతము. గ్లేజు ప్రతి 1-కి 0-8-0

తపాలాఖర్చు ప్రత్యేకము.

ధనలక్ష్మి కంపెని,

సౌకారుపేట, మదరాసు.

## లీలా

లేక

## సురేంద్ర నగరమణి

రసవంతమగు నవలారాజము

బాలురకు తలితండ్రులయందు భక్తియు, స్త్రీలకు పతియందలి ప్రేమయు, పురుషులకు రాజవిశ్వాసము యీగ్రంథపఠనచే యలవడును.

ప్రతి 1-కి రు 1-0-0

ఆర్యా బుక్ డిపో,

19, తాండవరాయ మొదలివీధి, తిరువళ్ళిక్కేణి, మదరాసు.